క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేట గ్రామానికి చెందిన మాసని రవి అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. దీంతో మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రూ. 1లక్ష ఎల్‌ఓసీ అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ అన్నివర్గాలను ఆదుకుంటున్నారని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహ్మద్ పాషా, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, తదితరులు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని జెడ్ చెరువు తండా గ్రామంలో అంతర్గత రోడ్లు ఆదివారం జాతీయ ఉపాధి హామీ నిధుల్లో భాగంగా రూ. 10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ మేరకు జెడ్ చెరువు తండాలో జాతీయ ఉపాధి పనుల్లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు వ్యయంతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధరాములు, గ్రామ సర్పంచ్ అరుణ్, ఎంపీటీసీ లద్ద సురేశ్, మంగ్యా నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సన్మానం



రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ భిక్షపతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న వినోదరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మఠం భిక్షపతిని సంగారెడ్డిలోని తన నివాసంలో ఆదివారం ఎంపీపీ వినోదరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వినోదరెడ్డి మాట్లాడుతూ.. భిక్షపతిని ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం హర్షనీయమన్నారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, సన్మానించామన్నారు. కార్యక్రమంలో జిల్లా జాగృతి మహిళా విభాగం కో కన్వీనర్ అరుణారెడ్డి, చిలప్‌చెడ్ మండల జాగృతి కన్వీనర్ విష్ణు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మెదక్‌జోన్: హవేళీఘనాపూర్ మండలంలోని సర్దన గ్రామంలో ఆదివారం గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాధాకిషన్‌యాదవ్, ఉప సర్పంచ్ రాంచందర్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు సతీశ్‌రావు, అస్తగల్ల బాల్‌రాజ్, మాల మహానాడు అధ్యక్షుడు సంజీవులు, లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు గోపాల్‌నాయక్, గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నర్సాపూర్: జాతీయ రహదారిపై వాహనాలు పెట్టుకొని పలువురు మద్యం తాగడంతో ఇతర వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న ఓ వైన్ షాపు పక్కన కొందరు నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై మద్యం తాగుతున్నందున సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ పద్మను వివరణ అడగ్గా.. తమకు సమాచారం లేదని, విచారణ చేయిస్తానని చెప్పారు.

మానవత్వం చాటిన స్నేహితులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బబ్బూరు శ్రీనివాస్ భార్య మాధవి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న శ్రీనివాస్ చిన్ననాటి స్నేహితులు మృతిరాలి కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల కోసం రూ.20వేల ఆర్థికసాయం అందించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, కరుణాకర్‌రెడ్డి, మల్లేశం, శ్రీనివాస్‌రెడ్డి, ఐలయ్య, యాదగిరి, ప్రవీణ్, మట్టి మనిషి ఫౌండేషన్ చైర్మన్ పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

- అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పిచ్చిమొక్కలు
- రోడ్డంతా బురదమయం
- ఇదీ.. పదోవార్డులో దుస్థితి



బ్రహ్మణపల్లిలో పాఠశాల భవనంలోని అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు

తూప్రాన్: మున్సిపల్ పరిధి 10వ వార్డు బ్రహ్మణపల్లి, వెంకటాపూర్ గ్రామాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. వెంకటాపూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనంలో అంగన్‌వాడీ కేంద్రం కొనసాగుతోంది. సుమారు 12 చిన్నారులు ప్రతీ రోజు కేంద్రానికి వస్తుంటారు. కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇవీ సమస్యలు:

- వెంకటాపూర్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలను నుంచి విద్యార్థులను రెండు కిలో మీటర్ల దూరంలోని బ్రహ్మణపల్లి పాఠశాలకు మార్చడంతో ప్రతీరోజు అక్కడకు వెళుతున్నారు.
- అంగన్‌వాడీకి సొంత భవనం లేక ప్రాథమిక పాఠశాలలో కొనసాగిస్తున్నారు. భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి.
- ఆదివారం పాఠశాల సమస్యలపై పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించగా సౌకర్యాలపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.
- ఈ విషయంపై కాంగ్రెస్ నాయకులు పాఠశాలను సందర్శించి వసతులను పరిశీలించి, వసతులు కల్పించాలని కోరారు.
- రెండు గ్రామాలు తూప్రాన్ మున్సిపల్‌లో విలీనం కావడంతో ఉపాధి హామీ పనులు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.
- వెంకటాపూర్ చెరువులో బతుకమ్మ ఘాట్ లేక మహిళలు ఏటా ఇబ్బందులు పడుతున్నారు.
- గ్రామాల్లో క్రీడా ప్రాంగాణం లేక క్రీడాకారులు ఆటలకు దూరం అవుతున్నారు.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి 10వ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పట్టణశాఖ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.



చెట్ల పొదల మధ్య మూత్రశాలలు



బురదమయంగా రోడ్డు



చిలప్‌చెడ్ (నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఆలయాల్లో ఆషాఢమాస పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చిట్కుల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన చాముండేశ్వరీ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. పక్కనే ఉన్న మంజీరా నదిలో భక్తులు స్నానమాచరించి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆషాఢమాసాన్ని పురస్కరించుకొని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేరు పక్కనున్న ఆలయంతో పాటు గుట్టపై స్వయంబుగా వెలిసిన లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఈఓ శశీధర్‌గుప్తా, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, విద్యాకర్‌చారి తదితరులు ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్ అమ్మవారికి ఉదయం పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.



శివ్వంపేట(నర్సాపూర్): లక్ష్మీనర్సింహ స్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మ ఆలయంలో..

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



శివ్వంపేటలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

నర్సాపూర్: తమ సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయితీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి నాల్గవ రోజుకు చేరింది. మండలంలోని ఆయా పంచాయతీలకు చెందిన కార్మికులు మహేశ్, లక్ష్మణ్, నర్సింలు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆదివారం సమ్మె చేపట్టారు. నాల్గవ రోజు పంచాయతీ కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చుని నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని కార్మికులు వాపోయారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో సీఐటీయూ కోశాధికారి నర్సవ్వ, పారిశుధ్య కార్మికులు ప్రవీణ్, మల్లేశం, రాములు, రవి, కిషన్, శ్యామల, తిరుమల్, రాజవ్వ, ఏసు, నర్సవ్వ, శాంతమ్మ, రాజవ్వ, రమేశ్, శ్రీనివాస్, సురేశ్, నర్సింలు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో..

కౌల్దారం(నర్సాపూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో మండల కార్మికుల సంఘం అధ్యక్షుడు మల్లేశం, హరి, జయ, బాలు, కృష్ణదాసు, శ్రీహరి, ప్రభాకర్, కరుణాకర్, దుర్గయ్య పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎల్లం, ఉపాధ్యక్షుడు నాగభుషణం, రెడ్డి రాజు, పద్మారావు, సామేల్ తదితరులు పాల్గొన్నారు.

కూచారంలో స్వచ్ఛభారత్



మొక్కలు నాటుతున్న యూత్ సభ్యులు

మనోరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారంలో నేచర్ ఐకాన్ యూత్ చేపట్టిన స్వచ్ఛభారత్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 273వ స్వచ్ఛభారత్‌లో భాగంగా గ్రామంలోని రోడ్డుకు ఇరువైపుల మొక్కలను నాటారు. కార్యక్రమంలో యూత్ సభ్యులతో పాటు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

నర్సాపూర్: ఈనెల 10న అంగన్‌వాడీ కోరికల రోజును జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు అన్నపూర్ణ పిలుపునిచ్చారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ఏర్పడినప్పటి నుంచి దానిని సంస్థగా కాకుండా ఒక ప్రాజెక్టుగా పరిగణిస్తున్నారని, అందులో పని చేస్తున్న తమను ఉద్యోగులను పర్మినెంట్ చేయకుండా స్కీం వర్కర్లుగా చేస్తూ తమతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆమె ఆరోపించారు. తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 10న అంగన్‌వాడీ వర్కర్లందరూ పాల్గొనాలని ఆమె కోరారు.

మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీ కోరికల దినాన్ని సోమవారం విజయవంతంచేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నర్సమ్మ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపు నిచ్చారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నరసింహ ఉన్నారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

నర్సాపూర్: పట్టణంలో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశంలోనే అతి పెద్ద యూనియన్‌గా ఏబీవీపీ అని, విపత్కర సమయాల్లో పని చేస్తుందన్నారు. విద్యార్థుల సమస్యలపై ఉద్యమిస్తుందని చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించి బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో అక్షయ్, అజయ్‌గౌడ్ కార్తిక్, సాయితేజ, రంజిత్, అర్జున్, సుజీత్, మనోజ, నందు, అనురుద్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మైనంపల్లి రోహిత్ ఎమ్మెల్యే కావాలని పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న యువకులు

రామాయంపేట(మెదక్): బీఆర్‌ఎస్ మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తనయుడు మైనంపల్లి రోహిత్ మెదక్ ఎమ్మెల్యే కావాలని ఆకాంక్షిస్తూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు, యువకులు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. ఈ మేరకు వారు మండలంలోని కాట్రియాల నుంచి పాపన్నపేట మండలం ఏడుపాయల దేవస్థానం వరకు 30 కిలోమీటర్ల మేరకు రమేశ్‌చారి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు, యువజన సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలోని ఎంఎస్‌ఎన్ పరిశ్రమ ద్వారా అందించిన రూ. 30 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ శ్రీలత, ఎంపీటీసీ శివకుమార్ ఆదివారం ప్రారంభించారు. ఎంఎస్‌ఎన్ పరిశ్రమ ప్రతినిధులు సంపత్‌రెడ్డి, తిరుపతి, నరహరి, ఉపసర్పంచ్ సత్యనారాయణగౌడ్, వార్డు సభ్యులు ప్రవీణ్‌కుమార్, నరేశ్, బాయి, పద్మ, పోచమణి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాలు



నర్సాపూర్: బోనాలతో భక్తులు

నర్సాపూర్: పట్టణంలోని రాయరావు చెరువు కట్టపై వెలిసిన రేణుకా ఎల్లమ్మకు ఆదివారం కుమ్మరులు తొలిబోనం సమర్పించామని ఆలయ ధర్మకర్త కుమ్మరి సురేందర్ చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలో గ్రామస్తులు కట్ట మైసమ్మకు బోనాలు ఉరేగించారు.



అల్లాదుర్గంలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని కాజీపేటలో పోచమ్మకు ప్రత్యేక పూజలు చేసి, బోనాలు ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలు ఊరేగించి సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు రాజేందర్, తాటి అంజమ్మ, శోభనర్సింగారావ్, నజియాసలావొద్దీన్, పీఏసీఎస్ డైరెక్టర్ రాయగిరి, నల్లపోచమ్మదేవి ధర్మకర్త దుర్గయ్య, వీరయ్య, నాయకులు పాల్గొన్నారు.



నర్సాపూర్ రూరల్: ఖాజిపేటలో బోనాలతో భక్తులు



వన భోజనానికి వెళ్తున్న గొల్లకురుమలు

సహపంక్తి భోజనం

టేక్మాల్(మెదక్): టేక్మాల్‌లో మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలోని గొల్లకురుమలు మంద పోచమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీరప్ప స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద గ్రామస్తులందరూ సహపంక్తి వన భోజనానికి వెళ్లారు.

సొంత భవనం నిర్మించాలి

అల్లాదుర్గం(మెదక్): గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించరా అని నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం ప్రజాప్రతినిధులు, అధికారులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా అల్లాదుర్గం మండలానికి మంజూరైన మహాత్మా జ్యోతిరావ్ పూలే గురుకుల బాలుర పాఠశాల.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం పెద్ద కంజర్లలో కొనసాగుతుందని వాపోయారు. గురుకుల పాఠశాలకు సొంత భవనం నిర్మించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ముందుకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడ మంజూరైతే అక్కడే గురుకుల పాఠశాల నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన ఫలితం లేదన్నారు. అల్లాదుర్గంలో ప్రభుత్వ భూమి ఉన్నా.. సొంత భవనం ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాములు, వీరయ్య స్వామి, కృష్ణ, బేతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మం

సంక్షిప్త వార్తలు

◆ పస్కా పండగ

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లిలో సీఎస్‌ఐ చర్చి సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పొలాల వద్ద పస్కా పండగను ఆదివారం నిర్వహించారు. చర్చి పాస్టర్ వ రెండ్ రమేశ్ ఆధ్వర్యంలో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పాస్టర్ బైబిల్ సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బీస కాంతపురుషోత్తం, సంఘం సభ్యులు యేసు, భూషణం, బాబు, అనురాధ, ప్రియా, రాజు, విజయ్, నిరంజన్, సుభాశ్, విక్కి, భాస్కర్, యోసేపు, చింటు పాల్గొన్నారు.

◆ నేడు ఆర్.ఇటిక్యాలకు త్రిష దామోదర్

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాల గ్రామానికి సోమవారం ఉదయం 7 గంటలకు త్రిష దామోదర్ రానున్నట్లు కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు ఈశ్వరప్ప, యూత్ నాయకుడు మల్లేశం ఆదివారం తెలిపారు. పల్లె పల్లెకు త్రిషమ్మ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

◆ నేటి నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

కౌల్దారం(నర్సాపూర్): మండల పరిధిలో రంగంపేట ఉన్నత పాఠశాలలో పదో, ఇంటర్ కోర్సుల్లో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు సోమవారం నుంచి చేపడుతున్నట్లు పాఠశాల హెచ్‌ఎం ఖాజా అలీ, పీడీ శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ మధ్యలో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా పై తరగతులను పూర్తి చేసేందుకు అవకాశం ఉందన్నారు. అడ్మిషన్ పొందేందుకు అభ్యర్థులు టీసీ, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను వెంట తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఈ క్రింది మొబైల్ నెంబర్ 94402 52670 ను సంప్రదించాలని సూచించారు.

◆ కనీస వేతనం అందించాలి



మనోహరాబాద్(తూప్రాన్): కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. జీపుజాతలో భాగంగా మండలంలోని మహాలక్ష్మి, గ్లోబల్, కాళ్లకల్ పొంద్రి, ఇంఫ్రాటెక్ పరిశ్రమల ఆవరణల్లో కార్మికులతో ఆయన మాట్లాడుతూ... కార్మిక చట్టాలు అమలు కాకపోవడంతో పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలతో పాటు, సౌకర్యాలు, భద్రత వస్తువులు ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. కార్మిక సమస్యలపై ఈనెల 14 ఆయా జిల్లాల్లో కలెక్టరేట్‌లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మహేందర్‌రెడ్డి, బస్వరాజ్, అసీఫ్, స్వామి, రాములు, వీరేశ్, సుగుణ, బాలేశ్, తిరుపతి, ఇంద్రేశ్, ఉపేందర్ సత్యనారాయణ, కార్మికులు ఉన్నారు.

◆ గురుకులంలో నాసిరకం భోజనం

తూప్రాన్: పట్టణ సమీపంలోని టోల్ ప్లాజా వద్ద ఉన్న బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆదివారం ఆందోళన వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలకు ఆదివారం పాఠశాలకు సెలవు దినం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను కలిసేందుకు పాఠశాలకు వచ్చారు. పాఠశాలలో తమకు నాసీరకం భోజనం పెడుతున్నారని విద్యార్థులు వివరించారు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వారు డిమాండ్ చేశారు.

◆ గొప్యాతండా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఎస్.కొండాపూర్ గొప్యాతండా రోడ్డు అభివృద్ధికి గిరిజన సంక్షేమ శాఖ నిధుల నుంచి రూ.26.50 లక్షలు మంజూరైనట్లు బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు తెలిపారు. ఆదివారం మండలంలోని ఎస్.కొండాపూర్ గోప్యాతండా రోడ్డు వద్ద సర్పంచ్ శశిరేఖ సత్యగౌడ్, ఎంపీటీసీ సునీతామోహన్ మాట్లాడుతూ.. తండాల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. మారుమూల గిరిజన తండాలకు సైతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం రహదారుల అభివృద్ధి చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శశిరేఖ సత్యగౌడ్, ఎంపీటీసీ సునీతామోహన్ తదితరులు ఉన్నారు.